
## పింఛన్ కోసం పరుగులు..




## అధ్వానంగా కలెక్టరేట్ రోడ్డు



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ముప్కాల్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి



**అక్షరటుడే, ముప్కాల్:** మాజీ సీఎం ఎన్టీ రామారావు జయంతిని ముప్కాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రాములు, గురుడు దయానంద్, లోక రాములు, లింగపురం చిన్నయ్య, జనార్దన్, లింగారెడ్డి పాల్గొన్నారు.



## తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వంపరంగా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరిస్తున్న తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరిందన్నారు. అయితే దిగుబడులు ఆలస్యంగా వచ్చిన చోట ధాన్యం సేకరణ కోసం 120 వరకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. అకాల వర్షం కురిసిన కారణంగా జిల్లాలో బషీరాబాద్, ఉప్లూర్ తదితర ప్రాంతాల్లో సుమారు 40 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం బస్తాలు తడిసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం పంపడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వేగవంతంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తాను కూడా స్వయంగా మిల్లులను సందర్శించి, ధాన్యం తరలింపు, అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలిస్తానన్నారు. తడిసిన ధాన్యం విషయమై ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు మేరకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# జీతాల దొంగలెవరో తేలేనా?

కామారెడ్డి బల్దియాలో కొందరు అక్రమార్కులు చేతివాటం ప్రదర్శించారు. అనుకోని పరిస్థితుల్లో విధులకు హాజరు కాని కార్మికులు హాజరైనట్టుగా రికార్డుల్లో నమోదు చేసి ఆ డబ్బులు కాజేశారు. ఈ తతంగం అంతా ఏసీబీ సోదాలలో బయటపడింది. ఏసీబీ సోదాలు చేసిన సమయంలో ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ సాగింది. అయితే ఇంతవరకు వారిపై చర్యలు తీసుకోలేదు.

- అక్షరటుడే, కామారెడ్డి



▸ కామారెడ్డి బల్దియాలో అక్రమార్కుల చేతివాటం ▸ పని చేయకున్నా పూర్తి జీతం ఇచినట్టుగా రికార్డులు ▸ చర్యలు చేపట్టని అధికారులు

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాల పేరుతో జరుగుతున్న దోపిడీ అప్పట్లో చర్చనీయాంశమైంది. పని చేయకుండానే నెలనెలా పూర్తి జీతాలు డ్రా చేస్తున్న వ్యవహారం మార్చి 16న మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో బట్టబయలు కావడంతో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నిజాయితీగా పని చేసే కార్మికుల సొమ్మును కొందరు అక్రమార్కులు నొక్కేస్తున్నా, నెలలు గడుస్తున్నా చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### పని చేయకున్నా పూర్తి జీతం

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు నెలలో సగం రోజులు, మరి కొందరైతే అసలు విధులకే హాజరుకాకపోయినా, మస్టర్ రోల్స్‌లో మాత్రం 30 రోజులు పని చేసినట్టు నమోదు చేసినట్టుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. గైర్హాజరైన కార్మికులను హాజరైనట్టుగా రికార్డుల్లో తప్పుడు నమోదు చేసి, ఆ డబ్బును దిగువ స్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారులు పంచుకుంటున్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. హాజరు పట్టికలు, బయోమెట్రిక్ రికార్డులు, జీతాల బిల్లుల మధ్య పొంతన లేకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### సగం జీతం వెనకేసిందెవరో..?

ఔట్ సోర్సింగ్ కార్మికుల జీతాల్లో కుంభకోణమనే చర్చ నడుస్తోంది. కొందరు కార్మికులకు పూర్తి జీతం మంజూరై బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నా, చేతికి మాత్రం సగం జీతమే ఇస్తున్నారు. మిగతా సొమ్మును మధ్యవర్తులు, కొందరు సిబ్బంది కలిసి మాయం చేస్తున్నట్టు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. అయితే సోదాలు జరిగి 3 నెలలు కావస్తున్నా సగం జీతం తీసుకున్న వ్యక్తులు ఎవరు? ఆ డబ్బు కార్మికులకు ఇచ్చారా లేదా? ఒకవేళ ఇవ్వకుంటే ఎవరు నొక్కేశారు? అనే విషయాన్ని అధికారులు ఇప్పటివరకు తేల్చలేదు.

### చర్యలు శూన్యమేనా..?

రెక్కాడితే కానీ డొక్కాడని ఔట్‌సోర్సింగ్ కార్మికుల కష్టాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. కార్మికుల పేరుతో నెలనెలా లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానా నుంచి కొల్లగొడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఏసీబీ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా శాఖాపరమైన విచారణ కానీ, బాధ్యులపై సస్పెన్షన్ కానీ లేకపోవడంతో అసలు దొంగలను కాపాడే ప్రయత్నం జరుగుతోందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక బడా నేతలు లేదా ఉన్నత స్థాయి అధికారుల హస్తం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. లేకపోతే ఇంత బహిరంగంగా జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.



## బ్రేకియల్ ఫ్లెక్సస్ సర్జరీ ద్వారా నరాల కదలిక

**అక్షరటుడే, కామారెడ్డి:** యశోద హాస్పిటల్స్‌లో అధునాతన 'బ్రేకియల్ ఫ్లెక్సస్ సర్జరీ' ద్వారా దెబ్బతిన్న నరాలను సర్జరీ చేసి, అవయవాలకు తిరిగి కదలికలు తీసుకొచ్చే అవకాశం ఉందని ఆస్పత్రి హైటెక్ సిటీ వైద్యుడు ప్రకాష్ తెలిపారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని యశోద బ్రాంచ్ క్లినిక్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రేకియల్ ఫ్లెక్సస్ ఇంజురీ అంటే చేతి నాడుల మీద తీవ్రమైన గాయమని వైద్యుడు ప్రకాశ్ తెలిపారు. ముఖ్యంగా బైకల నుంచి పడిపోయినప్పుడు ఈ గాయాలు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. ఇలా చేతి నరాలు దెబ్బతినడం వల్ల బ్రేకియల్ ఫ్లెక్సస్ ఏర్పడుతుందని, ఇది చేతి నరాలకు సంబంధించిన తీవ్రమైన సమస్య అని, సకాలంలో సర్జరీ చేయించుకుంటే చేతికి కదలికలు, స్పర్శ తిరిగి వస్తుందన్నారు. చేతిలో కండరాలు బండబారిపోవడం, చేతిలో స్పర్శ లేకపోవడం, కండరాలు పనిచేయకపోవడం, చేయిని పైకి ఎత్తలేకపోవడం లాంటివి జరుగుతుంటాయన్నారు. అలాగే భుజం ఎత్తలేకపోవడం, మోచేయి వంచలేకపోవడం, అరచేతి మూయలేకపోవడం, పూర్తిగా భుజం నుంచి చేతి వరకు నొప్పి రావడం లాంటివి లక్షణాలని, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులైన డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఏదైనా సందేహం ఉంటే యశోద హాస్పిటల్స్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.



## జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షటుడే,పెద్ద కొడప్‌గల్ :** మండలంలోని లింగంపల్లిలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్, టీకారం తండా సర్పంచ్ రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామప్ప పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా వివిధ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్టంలో రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకుంటుందన్నారు. అంతే కాకుండా రైతులు పండించిన జొన్న పంటలను మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విక్రయించుకోవాలని సూచించారు. దళారులను అమ్మి మోసపోవద్దన్నారు. ఒక్క ఎకరానికి 10 క్వింటాల జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని.. క్వింటాలుకు రూ.3,369 అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. జిల్లా పౌర సరఫరాల అధికారులు గురువారం డొంకేశ్వర్ సొసైటీ పరిధిలోని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, డీఎం సీఎస్‌సీ ప్రవీణ్, ఏసీఎస్‌వో కలిసి డొంకేశ్వర్ సొసైటీ పరిధిలోని నడ్కుడ, గాదెపల్లి, ఉమ్మెడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలకు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు నిల్వ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించడంపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ట్యాబ్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఈనెల 30వ తేదీ నాటికి ధాన్యం సేకరణ పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. అలాగే బ్యాక్‌వాటర్‌లో మునిగిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయరాదని స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం నందిపేట్ మండలం జోర్పూర్ గ్రామంలోని పూర్ణిమా పారా బాయిల్డ్ రైస్‌మిల్లును సందర్శించి, మిల్లుకు చేరుతున్న లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మిల్లర్ అంగీకార ప్రక్రియ ను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మిల్ యాజమాన్యానికి సూచించారు.

## బక్రీద్ పండుగ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షణ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో పండుగ సందర్భంగా పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను సీపీ సాయిచైతన్య పర్యవేక్షించారు. ఈద్గా పరిసర ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భక్తుల రాకపోకలు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పండుగకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు పరస్పర సహకారంతో పండుగను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, హోంగార్డ్ ఏసీపీ దీపక్ చంద్ర, సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గో హత్యలు ఆపాలని నిరసన



**అక్షరటుడే, బాన్సువాడ:** గోహత్యలు ఆపాలని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ మోస్రా ప్రఖండ ప్రతినిధులు నినదించారు. ఈ మేరకు మోస్రా మండల కేంద్రంలో వారు నినాదాలు చేశారు. ప్రభుత్వం గోహత్యల నివారణకు కట్టుదిట్టమైన చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు వెల్మా గోపి రెడ్డి, కార్యదర్శి సతీష్ కొండ్ర, బజరంగ్ దళ్ సంయోజక్ తరుణ్ నాయక్, శ్రీరామ్ పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా దేశాభివృద్ధికి పాటుపడాలి: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** భారతీయులందరూ కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా దేశాభివృద్ధికి పాటుపడాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. బక్రీద్ సందర్భంగా కామారెడ్డిలోని కోర్టు ఆవరణ ఈద్గాలో నమాజ్ చేశారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఈద్‌ఉల్‌అజ్హా పండుగ విశ్వాసం, త్యాగం, కరుణ, మానవత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం, సౌభ్రాతృత్వం నిండాలని ఆకాంక్షించారు. సమాజ సేవ, ఐక్యత, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ బలోపేతం చేసుకోవాలని కోరారు. భారతదేశం గంగాజమునా తహజీబ్ - భిన్నత్వంలో ఏకత్వం అనే సాంప్రదాయంతో వర్ధిల్లుతోందన్నారు. ఆవును దేశ జాతీయ జంతువుగా ప్రకటించాలని దేశ ముస్లిం మత పెద్దలు చేసిన విజ్ఞప్తికి మహమ్మద్ అలీ షబ్బీర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద నిర్వహించిన బక్రీద్ వేడుకలను ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలించారు. పండుగ సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈద్గాకు ప్రార్థనల నిమిత్తం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, మరియు పార్కింగ్ వసతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని అన్ని ఈద్గాలు, మసీదులలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా ముగిశాయని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





## ఆర్మూర్‌లో పంట మద్దతు ధరల ప్రతుల దహనం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరల ప్రతులను దగ్ధం గురువారం చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు పల్లపు వెంకటేష్, దేవరం మాట్లాడుతూ.. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కనీస మద్దతు ధరలలో నామమాత్రపు పెంపును ప్రకటించడం ద్వారా, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి భారతదేశ రైతులను మోసం చేసిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, పెట్రోల్, విద్యుత్, నీరు వంటి సాగు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా ప్రకటించిన ఈ పెంపు ఏమాత్రం సమంజసంగా లేదని వారు పేర్కొన్నారు. కార్పొరేట్లు, వ్యవసాయ వ్యాపార సంస్థలకు అనుకూలంగా ఉన్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, ఈ సవాళ్లను ఐక్యంగా ఎదుర్కోవాలని, ధనిక అనుకూల విధానాలను ఓడించడానికి నిరంతరం పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుతాడి ఎల్లయ్య, బామర్ల రవి, యాట కనకయ్య, కిషన్, ఏపీ గంగారం, శేఖర్, గంగాధర్, పోషన్న రవి, హకీం, నారేష్, గంగారం, రవి, తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో భర్త అదృశ్యం..

**కన్నీటి పర్యంతమవుతున్న భార్యాపిల్లలు**

**అక్షరటుడే, మెండోరా:** ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన భర్త అదృశ్యం కావడంతో భార్యాపిల్లలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మెండోరా మండలం దూదిగాం గ్రామానికి చెందిన తోకల శ్రీకాంత్ దుబాయ్ వెళ్లిన అనంతరం ఆచూకీ లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీకాంత్ ఈనెల 15వ తేదీన మరో తొమ్మిది మందితో కలిసి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లారు. వెళ్లిన మరుసటి రోజు ఫోన్‌లో మాట్లాడిన శ్రీకాంత్ మరుసటి రోజు నుంచి పనికి వెళ్తానని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అయితే ఆ తర్వాత నుంచి ఆయనతో ఎలాంటి సంప్రదింపులు జరగలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శ్రీకాంత్‌తో కలిసి వెళ్లిన మిగతా వ్యక్తులు పనికి వెళ్తున్నారని సంబంధిత ఏజెంట్ రమేష్ తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే గత 13 రోజులుగా శ్రీకాంత్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో ఆయన ఆచూకీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భార్య అలేఖ్య తెలిపింది. తనకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని.. తన భర్త ఎక్కడ ఉన్నాడో గుర్తించి సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కన్నీటి పర్యంతమయ్యింది.

## వ్యాపారి కిడ్నాప్ యత్నానికి చెక్..




**అక్షరటుడే, కామారెడ్డి:** శాంతిభద్రతలకు సవాల్ విసిరేలా కామారెడ్డి జిల్లాలో భారీ కిడ్నాప్ కుట్ర బట్టబయలైంది. వ్యాపారిని ఎత్తుకెళ్లి రూ. లక్షలు డిమాండ్ చేయాలనుకున్న ప్లాన్‌కు తాడ్వాయి పోలీసులు చెక్ పెట్టారు. అక్రమ తుపాకీ, రబ్బర్ బుల్లెట్లతో రెడీ అయిన ఆరుగురు కిరాతకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కటకటాల వెనక్కి నెట్టారు. ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం వివరాలు వెల్లడించారు.

### పగను మనసులో ఉంచుకుని..

కామారెడ్డికి చెందిన భూసా శ్రీనివాస్ వద్ద భారీగా నగదు ఉందని పసిగట్టిన నిట్టు నర్సింగరావు ముఠా కిడ్నాప్‌కు ప్లాన్ చేసింది. పాత లావాదేవీల పగతో వీరు ఈ దుస్సాహసానికి ప్రణాళిక వేశారు. ఇందుకోసం మహారాష్ట్ర నుంచి అక్రమ తుపాకీని రూ.30 వేలకు బేరం కుదుర్చుకుని, అడ్వాన్స్‌గా రూ.27వేలు చెల్లించారు. బుధ వారం కృష్ణాజీవాడి శివాలయం దగ్గర మాటు వేసిన ముఠా.. పోలీ సుల రాకతో షాక్‌కు గురైంది. పక్కా సమాచారంతో దాడి చేసిన ఎస్సై నరేశ్ టీం.. పారిపోతున్న నిందితులను వెంటాడి పట్టుకుంది.ఇప్పటికే హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న నిట్టు నర్సింగరావు ఈ కిడ్నాప్ స్కెచ్‌తో మళ్లీ అడ్డంగా దొరికిపోయాడు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రి చూస్తే వీరి ప్లాన్ ఎంత పకడ్బందీగా ఉందో అర్థమవుతోందని ఎస్పీ తెలిపారు. ఫైర్ ఆర్మ్, 5 రబ్బర్ బుల్లెట్లు, ఎయిర్ రైఫిల్ పెల్లెట్లు, 5 సెల్‌ఫోన్లు, మంకీ క్యాప్స్, మాస్కులు, నైలాన్ తాడు, గాగుల్స్, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. తాడ్వా యి మండలం చిట్యాలకు చెందిన నిట్టు నర్సింగరావు, సూరం స్వామి, సంతాయిపేట్‌కు చెందిన వడ్డె స్వామి, పులి ప్రశాంత్ గౌడ్, మహారాష్ట్రకు చెందిన తుపాకీ సప్లయర్స్ వైభవ్ ప్రకాశ్, అజయ్ గోంగపాలేలను అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న మారుతి మోకే కోసం గాలిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. నిందితులపై ఆర్మ్స్ యాక్ట్, బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం ఆసరా పెన్షన్లపై చేసిన ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. రెండు లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఏళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు.
– అక్షరటుడే, ఎల్లారెడ్డి




# పింఛన్ కోసం పరుగులు..

■ దరఖాస్తు చేసుకునేందుకు క్యూ కడుతున్న లబ్ధిదారులు.. ■ కిక్కిరిసిపోతున్న మీసేవ సెంటర్లు.. ■ ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు

పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయం, మీసేవ కేంద్రాల వద్ద జనాలు భారీగా గుమిగూడుతున్నారు. చాలా మంది ముందుగానే ఆదాయ ధ్రువీకరణ, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ వంటి పత్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. అనధికారిక అంచనాల ప్రకారం కామారెడ్డి జిల్లాలో కొత్తగా పెన్షన్‌కు అర్హులైన వారు 50 వేల మందికి పైగా ఉండొచ్చని సమాచారం.

### నాలుగేళ్లుగా నిరీక్షణ..

జిల్లాలో వేలాది మంది అర్హులు గత నాలుగేళ్లుగా ఆసరా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022 ఆగస్టులో చివరిసారిగా కొత్త పెన్షన్లు మంజూరు చేశారు. ఆ తర్వాత పూర్తి స్థాయిలో కొత్త పెన్షన్ల పంపిణీ జరగలేదు. కొత్త దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన ఆన్‌లైన్ వ్యవస్థ కూడా నిలిపివేయడంతో ప్రజలకు దరఖాస్తు చేసే అవకాశమే లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో మాత్రమే పరిమిత స్థాయిలో పెన్షన్లు మంజూరు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు.

### మధ్యవర్తుల హడావుడి

ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ల కోటా పూర్తయ్యేలోపు తమ పేర్లు నమోదు కావాలనే ఆత్రుత అర్హుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు మధ్యవర్తులు కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం. దరఖాస్తుల విషయంలో సాయం చేస్తామంటూ రూ.500 నుంచి రూ.2000 వరకు అడుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం మధ్యవర్తులను నమ్మవద్దని, నేరుగా మీ సేవ కేంద్రాలు, సంబంధిత కార్యాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.


### అధికారిక మార్గదర్శకాలు రాలేదు

గతంలో ఆసరా పెన్షన్ కోసం మీ సేవలో ఆప్షన్ ఉండేదని, ప్రస్తుతం అది అందుబాటులో లేదని ప్రజలు చెబుతున్నారు. కొత్త దరఖాస్తులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే స్వీకరిస్తారని ప్రచారం జరుగుతోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా అర్హత ధ్రువీకరణ తీసుకున్న దరఖాస్తులనే పైస్థాయి అధికారుల పరిశీలనకు పంపిస్తారనే సమాచారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతోంది. అయితే ఇప్పటి వరకు పెన్షన్ల దరఖాస్తులు, అర్హతలు లేదా ఎంపిక ప్రక్రియ పై అధికారిక మార్గదర్శకాలు జిల్లాస్థాయికి అందలేదని డీఆర్‌డీవో దామోదర్ చెబుతున్నారు.

### పెన్షనే జీవనాధారం

గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, వితంతువులు, అంగవైకల్యం కలిగిన వారికి ప్రభుత్వ పెన్షన్ ముఖ్యమైన జీవనాధారంగా మారింది. చాలా కుటుంబాల్లో వృద్ధులను, వికలాంగులను భారంగా భావించే పరిస్థితులు ఇంకా ఉన్నాయని సామాజిక వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం అందించే నెలవారీ రూ. 2,016 పెన్షన్ వారికి ఆర్థిక భరోసా మాత్రమే కాకుండా కుటుంబంలో గౌరవాన్ని తీసుకువస్తోందనే అభిప్రాయాలు ఉన్నాయి. 'పెన్షన్ ఉంటేనే బతుకుకు ధైర్యం' అని పలువురు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు చెబుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం త్వరగా స్పష్టత ఇవ్వాలని, ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.





## జిల్లాలో ఘనంగా బక్రీద్..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బక్రీద్‌ను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఉద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని ఖిల్లా ఈద్గా వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈద్గా అధ్యక్షుడు అబ్దుల్ రహ్మాన్, మెంబర్ ఎహశాన్ పాషా, ట్రెజరర్ ఇనాయత్ అలీ, మోల్‌సాబ్ ముఫ్తీ సయీద్ అక్బర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. ఎండాకాలం దృష్ట్యా ప్రత్యేకంగా షామియానాలు వేసి, తాగునీటి సౌకర్యం కల్పించారు. సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రార్థనా స్థలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చర్యలు చేపట్టారు.
- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ







## మోటార్ చోరీ కేసులో ఒకరి రిమాండ్..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రైస్‌మిల్‌లో మోటార్ చోరీ కేసులో ఒకరిని పోలీసులు రిమాండ్ చేశారు. ఈమేరకు రూరల్ ఎస్‌హెచ్‌వో సీహెచ్ వెంటకేశ్ గురువారం వివరాలు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్‌లోని విఠల్ గౌడ్ తన పాత రైస్‌మిల్ నుంచి 10హెచ్‌పీ మోటార్ చోరీ అయినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు సేకరించారు. అనంతరం ఖానాపూర్ గ్రామానికి చెందిన మహిపాల్ మోటార్‌ను చోరీ చేసినట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## పేస్‌మేకర్‌తో గుండె వేగం పరిమితం

**అక్షరటుడే, కామారెడ్డి:** గుండె లయ తప్పిన వారికి 'పేస్‌మేకర్' ఒక వరం లాంటిదని యశోద ఆస్పత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ఎంఎస్ ఆదిత్య తెలిపారు. కామారెడ్డి యశోద బ్రాంచ్ క్లినిక్‌లో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. గుండెచాలా నెమ్మదిగా కొట్టుకోవడం, హార్ట్ బ్లాక్, సిక్ సైనస్ సిండ్రోమ్ వంటి సమస్యలతో బాధపడే వారికి పేస్‌మేకర్ అమర్చడం ద్వారా సాధారణ జీవితం గడిపే అవకాశం ఉందని డాక్టర్ ఆదిత్య వివరించారు. ఇటీవల కార్డియాలజీ సమస్యలకు అనేక రకాల పరిష్కార మార్గాలు లభిస్తున్నాయని తెలిపారు. యశోద ఆస్పత్రిలో 12 మంది కార్డియాలజీ వైద్యులు ఉన్నారని, ఏ సమయంలో అయినా వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. వయసు ఎక్కువ అవుతుండడంతో గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయన్నారు.

### నిమిషానికి 60 కంటే తక్కువ సార్లు..

గుండె వేగం నిమిషానికి 60 కంటే తక్కువ సార్లు కొట్టుకునే బ్రాడీకార్డియా సమస్య ఉన్న వారిలో కళ్లు తిరగడం, అలసట, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయని డాక్టర్ పేర్కొన్నారు. పేస్‌మేకర్ అవసరమైనప్పుడు ఎలక్ట్రికల్ సిగ్నల్స్ పంపి గుండెను నార్మల్ స్పీడ్‌లో కొట్టుకునేలా చేస్తుందని తెలిపారు. దీనివల్ల రోగి ఆయాసం లేకుండా నడవగలరని, రోజువారీ పనులు చేసుకోగలరని వివరించారు. అంతేకాకుండా, హార్ట్ ఫెయిల్యూర్ ఉన్న కొందరికి సీఆర్‌టీ పేస్‌మేకర్ అమర్చడం ద్వారా గుండె రెండు గదులు ఒకేసారి కాంట్రాక్ట్ అయ్యేలా చేసి, పంపింగ్ సామర్థ్యం పెంచవచ్చని చెప్పారు. దీనివల్ల సడన్ కార్డియాక్ అరెస్ట్ రిస్క్ కూడా గణనీయంగా తగ్గుతుందని వివరించారు. సమావేశంలో కామారెడ్డి యశోద బ్రాంచ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అధ్వానంగా కలెక్టరేట్ రోడ్డు..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీలో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లకు నిధులు మంజూరైన ప్రధాన రహదారికి మాత్రం మోక్షం లభించడం లేదు. కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వెళ్లే రహదారి పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా తయారవుతోంది. వర్షాలు కురిసినప్పుడు మున్సిపల్ అధికారులు తట్టెడు మట్టి పోసి రూ.లక్షల్లో బిల్లులు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఏళ్ల తరబడి ఈ రహదారి గుంతలుగా మారి ప్రమాదకరంగా తయారైనా శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు.

### కొత్త బస్టాండ్ నుంచి రైల్వే గేట్ వరకు..

కొత్త బస్టాండ్ నుంచి రైల్వే గేటు వరకు ఈ రహదారి గుంతల బారిన పడింది. భారీ వర్షం పడితే ఈ రోడ్డు మొత్తం డ్రెయినేజీ నీటితో నిండిపోయి వాహనాలు మునిగిపోయే పరిస్థితి ఉంటుంది. చిన్న వాహనాలు నీటిలో కొట్టుకుపోయే పరిస్థితులు ఉన్నా అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రహదారిని బాగు చేయాలని స్థానిక వార్డు ప్రజలు రోడ్డుపై నాట్లు వేసి నిరసనలు తెలిపిన సందర్భాలున్నాయి. వేసవి కాలంలో కురిసే అకాల వర్షాల సమయంలో గుంతలో మట్టి పోసి, కంకర సిమెంట్ పొడి నింపి చేతులు దులుపుకుంటున్నారు. ఇక వర్షాకాలం అయితే ఈ దారి పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. రహదారి నిర్మాణానికి గతంలో నిధులు మంజూరైనా ఆ నిధులు ఎటు మళ్లించారో తెలియని పరిస్థితి నెలకొంది. వచ్చేది వర్షాకాలం కావడంతో పాటు ప్రస్తుతం అకాల వర్షాల నేపథ్యంలో కనీసం గుంతలపై రోడ్డు వేసి తాత్కాలిక పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. కలెక్టరేట్ కు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రమాదాలు జరిగితేనే రోడ్డు వేస్తారా..?



అశోక్ నగర్ కలెక్టరేట్ రహదారి ప్రమాదకరంగా మారింది. వర్షం పడి నీళ్లు నిలిస్తే వాహనాలు నిలిచిపోతున్నాయి. నీళ్లు నిలిస్తే గుంతలు ఎక్కడ ఉన్నాయి తెలియని పరిస్థితుల్లో గుంతలో దిగబడిన సందర్భాలు ఉన్నాయి. ప్రమాదకరమైన ఈ రోడ్డులో అనుకోని ప్రమాదాలు జరిగితేనే అధికారులు స్పందిస్తారా..?
- జొన్నల శ్రీనివాస్, కామారెడ్డి

### రోడ్డు బాగుచేసేదెప్పుడు



కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు వెంట వెళ్లాలంటే భయంగా ఉంది. వర్షాకాలం అయితే పరిస్థితులు చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రోడ్డును ఎప్పుడు బాగు చేస్తారో.. ఎప్పుడు వాహనదారుల సమస్య తీరుతుందో అధికారులు చెప్పాలి. - అర్కల గంగారాం యాదవ్, కామారెడ్డి